



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 286 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 03-02-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

## వేలకోట్లు కూడాబెడితే
# ప్రశ్నించవద్దా

**వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..?**




### పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించి, అక్రమంగా సంపాదించింది

- అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం
- అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదు
- బీఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సీఎం రేవంత్
- రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నాం
- రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సీఎం
- రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు

హైదరాబాద్ –
తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించి, అక్రమంగా సంపాదించిందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు.

-మిగతా 2 లో



## పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేధం

- బలూచీ ఆత్మాహుతి దాడిలో 50మది మృతి
- ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నట్లు గుర్తింపు

ఇస్లామాబాద్,-
పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేథం కొనసాగుతోంది. పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఆత్మహుతి దాడులు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల్లో మృతి చెందారు. బలూచిలోని 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు బాధ్యత వహిస్తూ.. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన వెలువరించింది. పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా 50 మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్

-మిగతా 2 లో



## పట్టణాల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

- బీఆర్ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి సాధ్యం
- బీజేపీకి 8మంది ఎంపిలున్నా రాష్ట్రానికి శూన్యం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపు

జయశంకర్
:రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పట్టణ ప్రజలకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖ బాధ్యతలను నిర్వహిస్తూ, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు , సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం

-మిగతా 2 లో



## ఇండియా పై టారీఫ్ తగ్గించిన అమెరిక

- 25% నుంచి 18 శాతానికి తగ్గింపు
- మోదీ నాకు గొప్ప స్నేహితుడు..
- భారత్‌పై ప్రతీకార టారీఫ్‌లు తగ్గిస్తున్నా..!
- ప్రకటించిన మెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ -
మెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడు తగ్గించి భారత్ పట్ల స్నేహహస్తం చాటుతున్నారు. ఈమధ్యే యూరోపియన్ యూనియన్, భారత్ మధ్య స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం కుదరడంతో కంగుతిన్న ట్రంప్.. వెనక్కి తగ్గారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోడీతో మాట్లాడినట్టు పేర్కొన్న అమెరికా అధినేత మోడీ తనకు గొప్ప స్నేహితుడని అన్నారు. అంతేకాదు ఇండియాపై ప్రతీకార టారీఫ్‌లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నాని వెల్లడించారు.గత కొన్నిరోజులుగా భారత్‌పై పగబట్టినట్టు ప్రవర్తించిన డొనాల్డ్ ట్రంప్ దారికొచ్చారు. అమెరికాను కాదని రష్యా, యూరోపియన్ యూనియన్‌తో

-మిగతా 2 లో

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హదరాబాద్

- బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ,-
బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులనువివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు.

-మిగతా 2 లో



## సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు

- చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు
- ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా
- కేసీఆర్ విచారణ తరవాత ప్కటనపై హరీష్ రావు అభ్యంతరం

హైదరాబాద్
చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు.

-మిగతా 2 లో

## రాహుల్ vs రాజ్‌నాథ్


### లోక్ సభలో మాటల యుద్ధం

- లద్దక్, డోక్లపై ప్రశ్నించిన రాహుల్
- మాజీ ఆర్మీ చీఫ్ బుక్ లోని అంశాలు ప్రస్తావించిన రాహుల్
- పబ్లిష్ కాని బుక్ పేరు ప్రస్తావించొద్దన్న రాజ్ నాథ్ సింగ్
- దేశభద్రతపైనే మాట్లాడుతున్న విపక్ష నేత
- అభ్యంతరం వ్యక్తం చేసిన అమిత్ షా

న్యూఢిల్లీ -
మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవాణే తన పుస్తకంలో రాసుకున్న వ్యాఖ్యలను రాహుల్ గాంధీ) పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీంతో లోక్‌సభలో రగడ నెలకొన్నది. ప్రచురణ కాని పుస్తకం నుంచి రాహుల్ వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కేంద్ర బడ్జెట్‌పై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. అయితే చైనా అంశంపై మాజీ ఆర్మీ చీఫ్

-మిగతా 2 లో





## బీజేపీ, డీఎంకేలపై విజయ్ ఫైర్


- ఒకటి డబ్బా ఇంజిన్..
- ఇంకోటి రిపేర్ ఇంజిన్..
- తమ టీవీకే పార్టీయే టాప్ ఇంజిన్
- డీఎంకేను అడ్డుకునే సత్తా ఒక్క టీవీకేకు మాత్రమే ఉంది

న్యూఢిల్లీ -
తమిళనాడులో అధికార డీఎంకే తమ రాజకీయ ప్రత్యర్థి అని నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ అన్నారు. బీజేపీ డబ్బా ఇంజిన్ అయితే, డీఎంకే రిపేర్ ఇంజిన్ అన్నారు. తమ టీవీకే పార్టీయే టాప్ ఇంజిన్ అంటూ చెప్పుకొచ్చారు. పార్టీ మూడో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన సమావేశంలో విజయ్ మాట్లాడారు.ఈ సందర్భంగా తమ పార్టీ తమిళుల కన్నీళ్లు తుడుస్తుందని విజయ్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో విజయ్ మాట్లాడారు. "అప్పట్లో ప్రజల కన్నీళ్లు తుడిచేందుకే నటుడు ఎంజీఆర్.. ఏఐఏడీఎంకేను స్థాపించారు. ఇప్పుడు మళ్లీ ప్రజలు కన్నీళ్లలో ఉన్నారు. మేం కూడా ప్రజల కన్నీళ్లు తుడుస్తాం. అన్నీ పొత్తులో ఉండే పార్టీలే. తమిళనాడులో డీఎంకేను అడ్డుకునే సత్తా ఒక్క టీవీకేకు మాత్రమే ఉంది.

-మిగతా 2 లో

## కులం కాదు.. గుణం చూసి ఓటేయండి

- మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్,
మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు

-మిగతా 2 లో

## గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

- బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు
- ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బిజెపి చీఫ్ రామచంద్రరావు



హైదరాబాద్,-
గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు,

-మిగతా 2 లో

# పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేధం

మొదటి తరువాయి



దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అయితే ఆ బాంబర్ పేరును మాత్రం వెల్లడించలేదు. బలోచిస్థాన్ అంతటా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని 'హీరోఫ్' పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించనున్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఆదివారం పేర్కొంది. ఈ విషయంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఆత్మాహుతి దాడుల్లో ఇద్దరు మహిళా నేరస్థులు పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. ఈ దాడులపై బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ స్పందించారు. పాకిస్థాన్ భద్రతా దళాలు 40 గంటలుగా ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగిస్తున్నాయని.. ఇందులోభాగంగా ఇప్పటివరకు 140 మందికి పైగా వేర్పాటువాదులను మట్టుబెట్టాయని వెల్లడించారు. స్థానిక పౌరుల వేషధారణలో ఉన్న బలోచ్ రెబల్స్ పాఠశాలలు, బ్యాంకులు, మార్కెట్లు, ఆసుపత్రులలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడుతున్నారని పాక్ మిలిటరీ తెలిపింది. ఏదైనా నగరం లేదా వ్యూహాత్మక స్థావరాన్ని స్వాధీనం చేసుకోవడానికి బలోచ్ రెబల్స్ ప్రయత్నాలు చేస్తున్నాయని.. అయితే వాటిని తమ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని పేర్కొంది.

# ఇండియా పై టారీఫ్ తగ్గించిన అమెరిక

మొదటి తరువాయి

ద్వైపాక్షిక సంబంధాలు, ఆర్థిక కార్యకలాపాలపై దృష్టి సారించిన ఇండియాను వదులుకోవద్దని భావించిన ఆయన మనసు మార్చుకున్నారు.'ఈరోజు ఉదయం భారత ప్రధాని మోడీతో మాట్లాడడాన్ని గౌరవంగా భావిస్తున్నా. మోడీ నాకు గొప్ప స్నేహితుడు. భారతదేశంలో శక్తివంతమైన నాయకుడు ఆయన. వాణిజ్యం, ఉక్రెయిన్ -- రష్యా యుద్ధాన్ని ముగించడం.. ఇలా మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. ఈ సందర్భంగా రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు మోడీ అంగీకరించారు. ఇకపై అమెరికా నుంచి.. వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేయనున్నారు' అని ట్రుత్‌లో ట్రంప్ రాసుకొచ్చారు.

# వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా

మొదటి తరువాయి

రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హదరాబాద్

మొదటి తరువాయి

అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ - బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ - చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ - పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. కేంద్ర బ్జడెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపును ఆయన వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026-27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బ్జడెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.

# బీజేపీ, డీఎంకేలపై విజయ్ ఫైర్

మొదటి తరువాయి

మూడు లేదా నాలుగు ఫ్రంట్లు ఏర్పడ్డా టీవీకే విజయం సాధిస్తుంది. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా ఎంజీఆర్‌ను అవమానించారు. అది కొందరు చేసే పని. మమల్ని విమర్శించినా వాళ్లను విమర్శించినట్లే. మేం డీఎంకే ప్రశ్నిస్తాం. వ్యతిరేకిస్తాం. టీవీకేకు ఒంటరిగానే గెలిచే సత్తా ఉంది" అని విజయ్ అన్నారు. తమిళనాడులో వచ్చే ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ పోటీలో టీవీకే ఒంటరిగా వెళ్తుందా లేక పొత్తుతో వెళ్తుందా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఏఐఏడీఎంకేతో పొత్తు కోసం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అందుకే విజయ్.. ఆ పార్టీపై పెద్దగా విమర్శలు చేయడం లేదు. బీజేపీ, డీఎంకేపై మాత్రమే విమర్శలు చేస్తున్నారు.

# పట్టణాల్లో కాంగ్రెస్‌నే గెలపించండి

మొదటి తరువాయి



చేస్తున్నారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని, మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ పార్లమెంట్ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని శ్రీధర్ బాబు విమర్శించారు. ఇంతమంది ఎంపీలు ఉండి కూడా నిధులు రాకపోవడం బాధాకరమని, ఇది రాష్ట్ర ప్రజలకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పూర్తిగా నిరాశజనకంగా ఉందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, విభజన చట్టంలోని 42 కీలక అంశాలు నేటికీ పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సమావేశాల్లోనైనా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించామని, కానీ కేంద్రం మళ్ళీ మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం వెంటనే స్పందించి విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతిష్టాత్మక సంస్థల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరును శ్రీధర్ బాబు ఎండగట్టారు. తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థ వస్తుందని రాష్ట్రం ఎంతో ఆశగా ఎదురుచూసిందని, కానీ బ్జడెట్‌లో దాని ఊసే లేకపోవడం దారుణమన్నారు. అలాగే హైదరాబాద్ నగరవాసుల చిరకాల స్వప్నమైన మెట్రో ఫేజ్-2 విస్తరణకు నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యా రంగంలో కేంద్రీయ , నవోదయ విద్యాలయాల కేటాయింపులో కూడా రాష్ట్రానికి మొండిచేయి ఎదురైందని విమర్శించారు. ఐటి , పారిశ్రామిక రంగంలో కీలకమైన సెమీ కండక్టర్ చిప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలను తెలంగాణకు కేటాయించడంలో కేంద్రం పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని, గతంలోనూ ఇదే జరిగిందని ఆయన గుర్తు చేశారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న లైఫ్ సైన్సెస్ , ఫార్మా పాలసీలను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవడం మన పాలనకు నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కేంద్రం కూడా తన బాధ్యతను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని కోరారు.

# సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు

మొదటి తరువాయి

కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నొసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు..ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే



అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సీట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.

# రాహుల్ VS రాజ్‌నాథ్

మొదటి తరువాయి

నరవాణే తన పుస్తకంలో రాసుకున్న వ్యాఖ్యలను రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఓ మ్యాగజైన్‌లో ప్రచురించిన పేజీలను ఆయన సభలో చూపించారు. తన వాదనను నిజం చేసే రీతిలో ఆ ప్రస్తావన ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికార పక్షం వ్యతిరేకించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంశాఖ మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని.. ఇంతకీ రాహుల్ చెప్పున్న ఆ బుక్ పబ్లిష్ అయ్యిందా లేదా అని ప్రశ్నించారు.హౌజ్ రూల్స్‌ను రాహుల్ గాంధీ ఉల్లంఘించినట్లు రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రచరణ జరగని పుస్తకాన్ని ఉద్దేశిస్తూ ఎలా వ్యాఖ్యానిస్తారని ఆయన ప్రశ్నించారు. ఆ పుస్తకంలో ఎంత వాస్తవం ఉందో ఎలా తెలుస్తుందని ఆయన అన్నారు. ఆ సమయంలో రాహుల్, రాజ్‌నాథ్ మధ్య వాగ్వాదం జరిగింది. చాలా విశ్వసనీయ సమాచారాన్ని తాను ప్రస్తావిస్తున్నట్లు రాహుల్ తెలిపారు. అయితే ఏ పుస్తకం నుంచి ఆ వ్యాఖ్యలను తీసుకున్నారో.. ఆ పుస్తకాన్ని సభలో ప్రవేశపెట్టాలని రాజ్‌నాథ్ డిమాండ చేశారు. ప్రతిపక్ష పక్ష నేత రాహుల్ ఆ బుక్‌ను సభలో ప్రవేశపెట్టాలని ఆయన అన్నారు. రాహుల్ గాంధీకి అండగా అఖిలేశ్ యాదవ్ మాట్లాడారు. చైనా అంశంపై చర్చించేందుకు రాహుల్‌కు అవకాశం ఇవ్వాలని అఖిలేశ్ కోరారు. చైనా అంశం చాలా సున్నితమైందని, సభలో ఆ అంశంపై సీరియస్‌గా చర్చ జరగాలన్నారు. జాతీయ భద్రత, విదేశీ విధానంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేతను అడ్డుకోరాదన్నారు. సభా వ్యవహారాలు సాగుతున్న సమయంలో మ్యాగిజైన్ లేదా వార్తాపత్రికల ఆర్టికల్స్‌ను సభ్యులు ప్రస్తావించరాదు అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అయితే ఇండో-చైనా సంబంధాలపై మాట్లాడే హక్కు తనకు ఉందని, ఏ నిబంధనలు తనను అడ్డుకోలేవని రాహుల్ గాంధీ అన్నారు. చైనాతో సంబంధాలపై మాట్లాడేందుకు ఏం రూల్స్ అడ్డు ఉన్నాయో చెప్పాలని రాహుల్ స్పీకర్‌ను కోరారు.

# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

మొదటి తరువాయి

మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్దిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ది పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు.

# కులం కాదు.. గుణం చూసి ఓటేయండి

మొదటి తరువాయి

వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేందప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు.

# యూనివర్సిటీ అన్నంలో గుట్కా ప్యాకెట్లు


### రోడ్ ఎక్కిన విద్యార్థులు



**నల్లగొండ ,ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహాత్మాగాంధీ యూనివర్సిటీలో భోజన నాణ్యతపై విద్యార్థులు భగ్గుమన్నారు. హాస్టల్లో వడ్డించిన అన్నంలో విమల్ గుట్కా ప్యాకెట్ల తో పాటు చెత్త బయటపడటంతో విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉడికి ఉడకని అన్నం వడ్డిస్తున్నారని ఆరోపిస్తున్న విద్యార్థులు, అందులో చెత్త రావడం పట్ల మండిపడ్డారు. నిరసనలో భాగంగా భోజన గిన్నెలను యూనివర్సిటీ బయట పెట్టి ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

### - మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



**నల్లగొండ, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సోమవారం నల్లగొండ జిల్లా ముషంపల్లి గ్రామంలో హిందీ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దాసోజు బ్రహ్మాచారి పదవీ విరమణ సన్మాన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో భాగంగా ముసంపల్లి గ్రామంలో హిందీ ఉధ్యాయుడిగా పనిచేసి విద్యార్థులు, గ్రామస్థుల మన్ననలు పొందారని కొనియాడారు. విద్యార్థుల మేధాశక్తిని పెంచే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు అన్నారు. అంకితభావంతో పనిచేసిన బ్రహ్మాచారిని ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుబలి నర్సిరెడ్డి, కానుగుల శ్రీనివాస్ అడిషనల్ కలెక్టర్ రంగారెడ్డి, కొమ్ము శ్రీనివాస్ డి సి ఈ బి కార్యదర్శి ,గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, హిందీ స్టేట్ రిసోర్స్ పర్సన్ యూసుఫ్ఫుద్దీన్, రిటైర్డ్ హెడ్మాస్టర్ శంకరయ్య, హిందీ ఉపాధ్యాయులు వెంకటయ్య ఆసిఫ్ జానీ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తపస్ నల్లగొండ జిల్లా కార్యదర్శి గా వేంకటేశ్వర్లు



**దేవరకొండ ఫిబ్రవరి 02. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి గా, నేలంటి వెంకటేశ్వర్లు స్కూల్ అసిస్టెంట్ ( మ్యాథమెటిక్స్ )ను ఎంపిక చేసినట్టు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలిపారు .ఎన్నికైన సందర్భంగా దేవరకొండ డివిజన్లోని మండల అధ్యక్ష కార్యదర్శులు అభినందించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పక్షాన తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్నీ విజయవంతం చెయ్యాలి

### - మండికారి బాలాజీ



**అచ్చంపేట, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలో బీజేపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండికారి బాలాజీ మాట్లాడుతూ ఫిబ్రవరి 4న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరగనున్న బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నభిన్ హాజరుకానున్నారని తెలిపారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా, కార్యకర్తలు, నాయకులు ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండికారి బాలాజీ, మంగ్యా నాయక్, రేణయ్య, శ్రీను నాయక్, రామచంద్రయ్య, శ్రీనివాస్ గౌడ్, శంకర్ మాదిగ, చంద్ లాల్ చౌహాన్, రాములు, అంతటి వెంకటేష్, గాలిమూడి రాము తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి అన్యాయం

**తెలకపల్లి ఫిబ్రవరి 02. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** కేంద్ర ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందని ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూలు జిల్లా కార్యదర్శి బలుమల ప్రేమ్ కుమార్ అన్నారు.సోమవారం

ఏఐఎస్ఎఫ్ తెలకపల్లి మండల నూతన సమితి ఎన్నిక తెలకపల్లి సిఎల్ఆర్ డిగ్రీ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ యందు ప్రవేశపెట్టిన2026-2027 వార్షిక బడ్జెట్ లో విద్యా రంగానికి అన్యాయం చేస్తున్నది. 12 ఏళ్ల మోడీపాలనలో విద్యా రంగానికి కేటాయింపులు తగినమొత్తంలో జరగటంలేదు. ఈ సంవత్సరం 53.5 లక్షల కోట్ల మొత్తం బడ్జెట్లో విద్యకు కేటాయించిన నిధులు కేవలం 1,39,289 కోట్లు. ఇది మొత్తం బడ్జెట్లో 2.6 శాతం మాత్రమే.ఈ నిధులు పెరిగినట్లు కనిపించినప్పటికీ మొత్తం బడ్జెట్ లో శాతంలో పెరుగుదల లేదు. కేంద్ర బడ్జెట్ లో కనీసం 10%, జిడిపిలో 6శాతం నిధులు కేటాయించాలని అనేక సంవత్సరాలుగా విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా కూడా ప్రభుత్వం కనీసం పట్టించుకునే పరిస్థితి లేదు.తెలంగాణ విభజన హామీ చట్టంలో ఉన్న విద్యాసంస్థలను కేటాయించకుండా, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు



కేటాయించకుండా అడుగడుగునా మొండి వైఖరిని ప్రదర్శిస్తుంది. 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్న కూడా తెలంగాణకి రావలసిన నిధులు, హక్కుల గురుంచి నోరుమెదపలేని పరిస్థితి నెలకొన్నది. రాజకీయ ప్రసంగాలు చేయడంలో ముందు వరుసలో ఉండే బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా చేతులు కట్టుకొని ఉంటూ.. తెలంగాణలో ఉన్న విద్యార్థులను, ప్రజలను మోసం చేస్తున్నారు.గత సంవత్సరం బడ్జెట్ 48,21,000,ల కోట్లు కాగా విద్యకు కేటాయించింది 1,28,628 కోట్లు, మొత్తం బడ్జెట్ లో 2.6 శాతం మాత్రమే. బడ్జెట్ కేటాయింపులు లేకుండా బడ్జెట్ ప్రసంగాలు ఎన్ని చేసినా క్షేత్రస్థాయిలో పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మిగులుతుంది. అని బలుమల ప్రేమ్ కుమార్ తెలియజేసారు.

ఏఐఎస్ఎఫ్ తెలకపల్లి మండలం నూతన సమితి ఎన్నిక అధ్యక్షులుగా భాస్కర్, కార్యదర్శులుగా భవాని, ఉపాధ్యక్షులు స్రవంతి, సహాయ కార్యదర్శిలుగా సరస్వతి, కోశాధికారిగా శిరీష ఎన్నుకోవడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఏఐవైఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దేశమని అంజనేయులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, రాహుల్, రవి, మల్లికార్జున్, లక్ష్మి, మరియు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలి

### -కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయ వాది,ఎర్ర కృష్ణ జాంభవ్.

**దేవరకొండ,ఫిబ్రవరి 02. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా, పట్టణాల్లో సుస్థిరమైన అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల కొనసాగాలంటే దేవరకొండ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు అత్యధిక మెజారిటీతో ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ పట్టణ ప్రజలను కోరారు. తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పట్టణాలకు కూడా విస్తరించాలని, దానికి మున్సిపల్ సంస్థల్లో కాంగ్రెస్ బలమైన ప్రాతినిధ్యం అవసరమని వివరించారు.



ముఖ్యంగా దేవరకొండ పట్టణంలో రోడ్లు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో ఇప్పటికే దేవరకొండ నియోజకవర్గంలో, పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్ల నిర్మాణం, పరిశుభ్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు వంటివి ఎమ్మెల్యే నిరంతర ప్రయత్నాల ఫలితంగా జరుగుతున్నాయని, ఈ కృషిని మరింత బలోపేతం చేయడానికి మున్సిపల్ కౌన్సిల్‌లో కాంగ్రెస్ ఆధిపత్యం అవసరమని వివరించారు.

పట్టణ ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, అభివృద్ధి పథంలో ఉన్న దేవరకొండను మరింత ఆధునిక, సుస్థిరమైన నగరంగా మార్చేందుకు కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పట్టణ ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, వృద్ధాప్య భద్రత వంటి పథకాలు పట్టణ ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, వీటిని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి మున్సిపల్ కౌన్సిల్ లో కాంగ్రెస్ పార్టీకి బలం చేకూర్చాలని ఆయన తెలిపారు.

దేవరకొండ పట్టణ ప్రజలు తమ సమస్యలను గుర్తించి, అభివృద్ధి దిశగా అడుగులు వేసే కాంగ్రెస్ అభ్యర్థులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# నల్లమల ప్రాంతంలో బీజేపీ పార్టీ బలోపేతానికి శంకర్ జి చేసిన సేవలు మరువలేనివి



**అచ్చంపేట, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలో దివంగత బీజేపీ నాయకుడు శంకర్ జి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండికారి బాలాజీ మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో బీజేపీ పార్టీ బలోపేతానికి శంకర్ జి చేసిన సేవలు మరువలేనివని, ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. శంకర్ జి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండికారి బాలాజీ, మంగ్యా నాయక్, రేణయ్య, శ్రీను నాయక్, రామచంద్రయ్య, శ్రీనివాస్ గౌడ్, శంకర్ మాదిగ, చంద్ లాల్ చౌహాన్, తేజస్విని, రాములు, శివ, ఉదయ్, మహేశ్వరి, అంతటి వెంకటేష్, గాలిమూడి రాము తదితరులు పాల్గొన్నారు.

# లింగాల గట్టు ఘటనపై జిల్లా ఎస్పీ వివరణ



**అమ్రాబాద్, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లింగాల గట్టు గ్రామంలో ప్రార్థన మందిరం (దర్గా) నిర్మాణం జరిగిందన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్పష్టం చేశారు.సంక్రాంతి సందర్భంగా గ్రామ విద్యార్థులు తాత్కాలికంగా క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేసి ఆటలు నిర్వహించారని, అనంతరం ఉపయోగించిన కుర్చీలను ఒకదానిమీద ఒకటి పేర్చి పచ్చ రంగు గుడ్డతో కప్పి ఉంచారని తెలిపారు. ఈ దృశ్యాన్ని కొందరు కావాలనే ప్రార్థన మందిరంలా చిత్రీకరించి సోషల్ మీడియాలో వీడియోలు ప్రచారం చేశారని పోలీసులు వివరించారు.సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అక్కడ ఎలాంటి ప్రార్థన మందిరం లేదని నిర్ధారించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కూడా పరిశీలించి పుకార్లలో ఎలాంటి నిజం లేదని వెల్లడించారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు ప్రజల్లో భయాందోళనలు, అపోహలు కలిగించే ప్రమాదం ఉందని ఎస్పీ హెచ్చరించారు. నిర్ధారణ లేకుండా ఇలాంటి వార్తలను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని సూచించారు.లింగాల గట్టు గ్రామంలో ఎలాంటి ప్రార్థన మందిరం లేదని మరోసారి స్పష్టం చేస్తూ, ప్రజలు శాంతి భద్రతలకు భంగం కలిగించే అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ విజ్ఞప్తి చేశారు.

## విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్‌ను కలిసిన వెల్జాల్ కాంగ్రెస్ నాయకులు



**తలకొండపల్లి, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెల్జాల్ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మార్చి నెలలో మంజూరు చేయబడుతుందని, రాబోయే విద్యా సంవత్సరంలో ఆ పాఠశాలలోనే అడ్మిషన్లు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జి. శ్రీనివాసమూర్తి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు బి. నర్సింలు, ఎం.ఏ. అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్, నాయకులు టి. కృష్ణయ్య గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య మహిళ పరీక్షలు తప్పనిసరి చేయాలి

**ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తీదేడు గ్రామ సర్పంచ్.**



**దేవరకొండ ఫిబ్రవరి 02. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
మహిళలకు ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని పల్లె దవాఖానానలో జన ఆరోగ్య సమితి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఆరోగ్య దవాఖానాలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా వైద్య పరీక్షలను పరిశీలించారు. మహిళలకు బీపీ పరీక్ష చేయించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి మహిళ ఆరోగ్య మహిళా వైద్య పరీక్షలు చేయించుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. బిపి,షుగర్ వ్యాధి ఉన్నవారికి పల్లె దవాఖానా నుంచి ప్రతి నెల మందులు అందజేయాలని తెలిపారు. రక్తహీనత ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఐరన్,క్యాల్షియం వంటి మాత్రలు అందజేయాలని,ఐరన్ సమకూరే ఆహారాన్ని సూచించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు,ఉలుపాల శేఖర్ రెడ్డి,తీదేడు గ్రామ శాఖ అధ్యక్షుడు సోనగంటి గొవర్ధనాచారి, వార్డు సభ్యులు , సిమర్ల శ్రీను యాదవ్, ఏఎన్ఎం రామలక్ష్మి,అంగన్వాడి టీచర్లు,ఆశావర్కర్లు,గ్రామస్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో టౌన్ లెవెల్ చెస్ టోర్నమెంట్

**షాద్‌నగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్ ఇండియన్ హైట్స్ పాఠశాలలో ఫిబ్రవరి 8న టౌన్ లెవెల్ చెస్ టోర్నమెంట్ జరగనుంది. పాఠశాల ప్రిన్సిపల్ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో అండర్ 08, 10, 12, 14, 16 విభాగాల్లో బాలబాలికలు పాల్గొనవచ్చు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఫిబ్రవరి 6వరకే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9133344664, 9346843126 నంబర్లను సంప్రదించవచ్చు. విద్యార్థుల్లో మేధస్సు వికాసానికి, క్రమశిక్షణకు ఈ పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తూప్రాన్ హైవే నాగులపల్లి బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం



**తూప్రాన్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తూప్రాన్ హైవే నాగులపల్లి బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. చేగుంట మండలం అనంతసాగర్‌కు చెందిన మహేష్ (40) గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ సహాయంతో మహేష్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

**- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్**



**వెల్దండ, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అచ్చంపేట నియోజకవర్గంలో మున్సిపల్ ఎన్నికల సమీక్ష సమావేశానికి వెళ్తూ, వెల్దండ గ్రామ పంచాయతీ సర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు కృషి చేసిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, ఉప సర్పంచ్ బస్నమోని శ్రీనివాస్, వార్డు సభ్యులు రంగనాథ్, గుద్దటి కిష్టల్, మారేపల్లి శ్రీను, ముదికొండ రమేష్, పురుషోత్తం, సునీత ఆనంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిమ్మెల తిరుపతి రెడ్డి, ఎండీ అమిద్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, మండల యూత్ అధ్యక్షుడు భరత్ గౌడ్, కృష్ణముదిరాజ్, ఎండీ రషీద్, రేవల్లి రాజు, దాసరి మహేష్, బొక్కల శ్రీనివాస్, డేవిడ్, రమేష్ గిందీప్, ఎండీ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

**- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి**



**ఆమనగగల్లు, ఫిబ్రవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన 15 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి అవ్వారి రేవతికి కాంగ్రెస్ బీఫామ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెల్లి వివరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలోశివ లింగం, శేఖర్, సురేష్,గౌస్,భాస్కర్, ధోని,సూర్య,శ్రీను, తోట శ్రీను,ఆకాష్,శివ,గాజుల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కుల సంఘ నూతన కమిటీకి ఘన సన్మానం



**పెద్దపల్లి ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ముదిరాజ్ కుల సంఘ నూతన కమిటీని పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ సన్మానించారు. పెద్దమ్మ తల్లి గుడి వద్ద గల సంఘ భవనంలో కమిటీ అధ్యక్షుడు పెసరు రమేష్, డైరెక్టర్లు బుజ్జ మల్లయ్య, పెసరు కోటయ్య, గుర్రం లక్ష్మీనర్సయ్య, బొజ్జ పెద్దులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘువీర్ సింగ్ మాట్లాడుతూ ముదిరాజ్ కుల సోదరులతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, అభివృద్ధి దిశగా నూతన కమిటీ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ తొగరు శ్రీనివాస్, నాయకులు కొండపల్లి కృష్ణమూర్తి, పూరెల్ల గంగయ్య గౌడ్, పల్లె చిన్న రాములు గౌడ్, ఉయ్యాల వెంకటేష్ గౌడ్, కల్లెపల్లి అంజయ్య, గడ్డమీది శ్రీనివాస్ గౌడ్, మద్దెల నరేష్, బుర్ర మహేష్ గౌడ్, బొజ్జ రాయమల్లు, రాజన్నల రాజలింగు, గుండు చంద్రమొగిలి గౌడ్, దాడి నాగరాజు, కల్లెపల్లి స్వామి, మూడపెల్లి బాలకృష్ణ, గుర్రం చంద్రయ్య, బొజ్జ నర్సయ్య, పెసరు అంజయ్య, గజ్జెల్ల రాజేశం, గుండు సాగర్ గౌడ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేందుకు ప్రతి అభ్యర్థి కృషి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. సోమవారం 15 వార్డుల అభ్యర్థులకు బీ-ఫారమ్‌లు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి, వార్డుల వారీగా ప్రత్యేక ప్రణాళికలతో విజయాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. అభ్యర్థులంతా సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఇంచార్జి శ్రీనివాస్ గౌడ్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మెకానిక్ బాబా, శ్రీశైలం, అలీమ్, గౌస్, శీను నాయక్, శివలింగం, కుమార్ గౌడ్, మైసయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. మున్సిపాలిటీ ఏడవ వార్డు అభ్యర్థి కిషోర్ నాయక్ వెంకటేశ్వర కాలనీలో తిరుగుతూ ప్రజలను కలిశారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో అమలైన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, పట్టణ అభివృద్ధి కోసం మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజల మద్దతు కోరారు.

## ఎంజిఎన్ఆర్ఈజిఏ బచావో కార్యక్రమంలో పాల్గొన్న మీనాక్షి నటరాజన్



**అమ్రాబాద్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎంజిఎన్ఆర్ఈజిఏ బచావో విబిజి.రామ్.జి హటావో కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అచ్చంపేట మండలం బుద్ద తండా, బల్మూరు మండలం చెంచుగూడెం గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసిన మీనాక్షి నటరాజన్‌కు ఘన సన్మానం నిర్వహించారు. తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, బల్మూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గంజాయిని నిర్మూలించండి

## ప్రాణాలను కాపాడండి



**పెద్దపల్లి, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా పోలీసులు ఇద్దరిని పట్టుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ఖాజా బషిరుద్దిన్ (24), షోయబ్ అక్తర్ (23) నాగపూర్ రైల్వే స్టేషన్ వద్ద గంజాయి కొనుగోలు చేసి, ఆటోలో ఇతరులకు అధిక ధరకు అమ్మడానికి వెళ్తుండగా పట్టుబడ్డారు.వారి వద్ద నుంచి 807.52 గ్రాముల ఎండు గంజాయి, సుమారు నలభై వేల రూపాయల విలువ గల మత్తు పదార్థం, అలాగే బజాజ్ ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ చర్యతో గంజాయి వ్యసనాన్ని అరికట్టి యువత ప్రాణాలను కాపాడాలని పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులు స్పష్టం చేశారు.

# గౌడ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి



**పెద్దపల్లి, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
:పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గౌడ కమ్యూనిటీ హాల్, గౌడ హాస్టల్ నిర్మాణం కోసం మూడు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని గౌడ సంఘాల నాయకులు ఎమ్మెల్యే చింతకుంట విజయరామణారావుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో గౌడ కులానికి చెందిన వారు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ కమ్యూనిటీ హాల్ లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. వివాహాలు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలకు హాల్ అవసరమని, అలాగే కళాశాలల్లో చదువుతున్న గౌడ విద్యార్థులకు వసతి సదుపాయం లేక ఇబ్బందులు ఎదురవుతున్నందున హాస్టల్ నిర్మాణం అత్యవసరమని తెలిపారు.రాఘవాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 1072లో ఉన్న మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి కమ్యూనిటీ హాల్, హాస్టల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిప్ప రాజమౌళి, గోపగోని సారయ్య, బాలసాని వెంకటేశం, సింగం సత్తయ్యతో పాటు మల్యాల రాంచంద్రం, పడాల కొమురయ్య, కోల లక్ష్మణ్, అంజి, గుర్రం సదయ్య, నాగుల రాజేశం, పాకాల రాజయ్య, తోడేటి మురళి, తాళ్లపల్లి లింగయ్య, బాలసాని చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## ఐ.రాణి కుముదిని

**పెద్దపల్లి, ఫిబ్రవరి 2(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




మున్సిపల్ ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని సూచించారు.జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నామినేషన్ల ఉపసంహరణ గడువు తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు నిబంధనల ప్రకారం జరగాలని తెలిపారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేయాలని, పోలింగ్ బృందాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కౌంటింగ్ ముగిసిన తర్వాత మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం ఫారం--2లను సిద్ధం చేసి ముందుగానే ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓద్యారం జెడ్‌పిహెచ్‌ఎస్‌లో తల్లి

## -బిడ్డలతో ఉచిత వైద్య శిబిరం




**గంగాధర, మండలం, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓద్యారంలో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది.శిబిరంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఓపీ పరీక్షలు, అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. పోషకాహార లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి తగిన చికిత్స అందించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలికి అవసరమైన డైట్ ప్లాన్ వివరించారు.ప్రత్యేకంగా అమ్మాయిలు తమ తల్లులతో కలిసి వైద్యులను కలసి ధైర్యంగా ఆరోగ్య సమస్యలను వివరించడం ఈ శిబిరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తల్లులు కూడా తమ సమస్యలను వైద్యులకు చూపించి అవసరమైన సహాయం పొందారు. అత్యవసర చికిత్స అవసరమైన విద్యార్థులను జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు.శిబిరం అనంతరం అమ్మాయిలకు, అబ్బాయిలకు వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి శుభ్రమైన జీవనశైలి, పోషకాహారం, ఉత్తమ అలవాట్లపై వైద్యులు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమాన్ని రాజగోపాల్ పర్యవేక్షణలో మెడికల్ ఆఫీసర్ శ్వేత, డా. శిరీష, డా. సుమన్ మరియు వారి సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించారు. మండల విద్యాధికారి ఎనుగు ప్రభాకర్ రావు హాజరై శిబిరాన్ని పరిశీలించి, విద్యార్థులు--తల్లిదండ్రులతో మాట్లాడి వైద్య శిబిరాల ప్రాముఖ్యతను వివరించారు.

# చట్టం ముందు అందరూ సమానులే

## - కాంగ్రెస్ బీసీ సెల్

**కరీంనగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫోన్ టాపింగ్ కేసులో సిట్ అధికారులు కేసీఆర్‌ను విచారణకు పిలవడంపై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా చైర్మన్ పులి ఆంజనేయులు తీవ్రంగా విమర్శించారు. డిసిసి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని, కేసీఆర్‌ను ప్రశ్నిస్తే తెలంగాణను ప్రశ్నించినట్టుగా భావించడం తప్పు అని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎవరినైనా ప్రశ్నించే హక్కు చట్టానికి ఉందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలను ఓర్వలేక బీఆర్ఎస్ కుట్రలు పన్నుతోందని, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ముందు ఎవరైనా ఒకటేనని, కాళేశ్వరం అవినీతి తెలంగాణ ప్రజలను నివ్వరపోయేలా చేసిందని అన్నారు. ప్రజా కవి గద్దర్, ప్రొఫెసర్ కోదండరాం వంటి ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది బీఆర్ఎస్ అని ఆయన మండిపడ్డారు.

# కురుమ సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రిసిటీ సూపరింటెండెంట్కు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదవీ విరమణ పొందిన మేక రమేష్ బాబును జిల్లా కురుమ సంఘం ఘనంగా సన్మానించింది.ఎల్ఎండి కాలనీలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న ఆధ్వర్యంలో నాయకులు శాలువా కప్పి, బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమేష్ బాబు 35 సంవత్సరాలుగా ఏ.ఇ.గా ప్రారంభించి అంచెలంచెలుగా పదోన్నతులు పొంది మంచిర్యాల, కామారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో సేవలందించి ఎస్.ఇ.గా పదవీ విరమణ పొందారని, ఎలాంటి మచ్చలేని అధికారిగా అందరి ఆదరాభిమానాలు పొందారని తెలిపారు.కురుమ కులంలో, చండీశ్వర గోత్రంలో జన్మించి విద్యా, ఉద్యోగ రంగాల్లో ఆదర్శంగా నిలిచారని, యువతకు ప్రేరణగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగరీత్యా బిజీగా ఉన్నప్పటికీ సంఘానికి సమయం కేటాయించి సహకరించారని గుర్తుచేశారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె రాజు, ఉపాధ్యక్షుడు యేగుర్ల అశోక్, ట్రస్ట్ అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం కోశాధికారి గుంట రవీందర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బిఎంఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

## - పప్పుల సురేష్




**కరీంనగర్ ,ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని బిఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేష్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని బిఎంఎస్ ఆరే ఏ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫిబ్రవరి 6 నుండి 8 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో జరగనున్న మహాసభల్లో దేశ, విదేశాల నుండి 2500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్వతంత్ర కార్మిక సంఘం అయిన బిఎంఎస్, కార్మికుల శ్రేయస్సు కోసం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్కరణలపై చర్చలు జరిపి పలు తీర్మానాలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్, అముదుర్తి రవి, శ్రీనివాస్, రంజిత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ మార్చ్ విజయవంతం చేయాలి

## ఉపాధ్యాయ సంఘం

**కరీంనగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద ఫిబ్రవరి 5న జరగనున్న పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి చకినాల రామ్‌మోహన్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.ఆల్ ఇండియా జాయింట్ ఆక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ఐజాక్టో) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మార్చ్‌లో దేశవ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. తెలంగాణ నుంచి కూడా అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని వారు కోరారు.విద్య హక్కు చట్టం అమలు కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జాతీయ విద్యా విధానం 2020ని విరమించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేతను నిలిపివేయాలని, కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించి కనీస వేతనాలు అమలు చేయాలని, ఎనిమిదవ సెంట్రల్ పే కమిషన్‌ను సకాలంలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ మార్చ్ ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను జాతీయస్థాయిలో బలంగా వినిపించాలనే ఉద్దేశంతో ఐజాక్టో కార్యాచరణ సమితి ఏర్పాటుచేసిందని నాయకులు తెలిపారు.

# ఘనంగా ప్రారంభమైన సీఎం కప్ ఆటల పోటీలు

**పాలకుర్తి, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



పాలకుర్తి మండలం బసంతనగర్ ఇండియా మిషన్ సెకండరీ స్కూల్లో సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీలను ఎంపిడిఓ శశికళ సోమవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించి శారీరకంగా దృఢంగా ఉండడానికి దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడమే లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం బాలికలకు ఖోఖో, అథ్లెటిక్స్, యోగా, కబడ్డీ పోటీలు నిర్వహించగా, మంగళవారం బాలురకు ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ఫారం, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ మహేంద్రన్, పీడీఎస్ కృష్ణమూర్తి, సోమశేఖర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్సీనీ ఆకస్మిక తనిఖీ చేసిన డాక్టర్ వెంకటరమణ



**చొప్పదండి, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, డిపిఓ ఎన్‌హెచ్ఎం స్వామిలతో కలిసి చొప్పదండి, గుమ్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్‌పేషెంట్ రిజిస్టర్, ఎన్‌సిడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్, పిల్లల టీకాల నిల్వ కోసం ఉపయోగించే ఐఎల్ఆర్ మరియు దాని రోజువారీ టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. సోమవారం హెల్త్ చెకప్ కోసం వచ్చిన గర్భిణీల ఎంసిపి కార్డులను పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. అలాగే అవుట్‌పేషెంట్లను పలకరిస్తూ వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు సేకరించారు. స్టాఫ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ పీహెచ్సీ డెలివరీలను మెరుగుపరచాలని, గర్భిణీల చెకప్స్ సంఖ్యను పెంచాలని, అభా కార్డుల సృష్టి వేగవంతం చేయాలని సూచించారు. 13 ఏళ్లు పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ చేసి, రీ--స్క్రీనింగ్, ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. ప్రసూతి గది పరిశుభ్రత, ప్రోటోకాల్ చార్టులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ కీర్తన, డాక్టర్ అరుణతో పాటు సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మిషన్ 10వ తరగతి పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




**గంగాధర, జనవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన మిషన్ 10వ తరగతి పోస్టర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం 2026 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. విద్యారంగానికి ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ సంస్థలు తోడ్పడటం అభినందనీయమని, విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ హాస్టల్‌లో స్వెంజర్లను తొలగించలన్న ప్రతిపాదనను విరమించాలని డిమాండ్



**కరీంనగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మోడల్ స్కూల్ హాస్టల్‌లలో స్వెంజర్లను తొలగించి బాత్రూమ్‌లను వంట మనుషులతో కడగాలనే ప్రతిపాదనను విరమించి, పాత విధానంలోనే ప్రతి హాస్టల్‌కు ఒక స్వెంజర్‌ను నియమిస్తామని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ డా. ఈ. నవీన్ నికోలస్ హామీ ఇచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన మహిళలు వినతి పత్రం అందజేయగా, కమిషనర్ వారిని తన ఛాంబర్‌లోకి పిలిచి సమస్యలు విన్నారు. కార్మికులు బాత్రూమ్‌లు కడగటం తమకు సాధ్యం కాదని, సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున మళ్లీ వస్తామని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర కన్వీనర్ ఎడ్ల రమేష్ మాట్లాడుతూ వంట మనుషులతో బాత్రూమ్‌లు కడగించడం అనాగరిక చర్య అని, హాస్టల్ పిల్లలు కూడా దీనిని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వంటగదిలో ముగ్గురు ఉంటేనే నాణ్యమైన ఆహారం అందించగలమని, వంటతో పాటు శుభ్రత, వసతి గదుల సంరక్షణ, కాపలాదారు పనులు కూడా చేస్తున్నారు కాబట్టి బాత్రూమ్ పనులు మళ్లీ అప్పగించడం సరైంది కాదని అన్నారు. హాస్టల్ రూమ్స్ శుభ్రత కోసం అదనంగా ఇద్దరు స్వీపర్లను నియమించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

# తెలంగాణలో విద్యార్థి సంఘ ఎన్నికలు జరపాలని డిమాండ్




**కరీంనగర్ ,ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని, తక్షణమే రాష్ట్రంలో ఎన్నికలు జరపాలని పి.డి.ఎస్.యు, ఎస్ఎఫ్ఐ, బీసీ విద్యార్థి సంఘాలు కోరాయి. సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ఆధ్వర్యంలో "విద్యార్థి సంఘాల ఎన్నికలు--ఆవశ్యకత" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, అధ్యక్షుడు కాంపల్లి అరవింద్, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి వినుకొండ ధీరజ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లెంకలపల్లి అనిల్ యాదవ్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయని, విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10%, రాష్ట్ర బడ్జెట్‌లో 30% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత 38 సంవత్సరాలుగా విద్యార్థి సంఘ ఎన్నికలు జరగకపోవడంతో ప్రజాస్వామిక లక్షణాలు, రాజకీయ అవగాహన విద్యార్థుల్లో తగ్గిపోతున్నాయని వారు పేర్కొన్నారు. 2006లో జే.యం. లింగ్డో సుప్రీంకోర్టు సూచనల మేరకు విద్యార్థి ఎన్నికలు ఉండాలని సిఫారసు చేశారని గుర్తు చేశారు. 1988లో ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యాసంస్థల్లో ఘర్షణల కారణంగా ఎన్నికలు నిలిపివేశారని, ఇప్పుడు విద్యార్థి దశలో ఉన్న నీతి, నిజాయితీ, నిస్వార్థ ఆలోచనలు భవిష్యత్తుకు స్వచ్ఛమైన నాయకత్వాన్ని అందిస్తాయని తెలిపారు. తెలంగాణ విద్యాశాఖ కమిషన్ రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు సూచనల మేరకు విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# యూరియా బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన సదస్సు



**హుస్నాబాద్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గం రామవరం గ్రామంలో రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత యూరియా బుకింగ్ మొబైల్ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు యూరియా ఎరువులు సకాలంలో, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను ఫిబ్రవరి 2 నుంచి సిద్ధిపేట జిల్లాలో ప్రారంభించామని తెలిపారు. ఇకపై యూరియా కొనుగోలు పూర్తిగా మొబైల్ యాప్ ద్వారానే జరగనుందని, రైతులు తమ పంట వివరాలు నమోదు చేసి అవసరమైన పరిమాణాన్ని బుక్ చేసుకోవాలని సూచించారు. పాస్‌బుక్ నంబర్, మొబైల్ నంబర్ నమోదు చేసిన తరువాత ఓటీపీ ద్వారా ధృవీకరణ జరుగుతుందని, భూమి విస్తీర్ణం ఆధారంగా యూరియా విడతలుగా సరఫరా చేస్తామని వివరించారు. 5 ఎకరాల లోపు రైతులకు రెండు విడతలలో, 5--20 ఎకరాల రైతులకు మూడు విడతలలో, 20 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు నాలుగు విడతలలో యూరియా అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు డీలర్ వద్దకు వెళ్లే ముందు తప్పనిసరిగా బుకింగ్ నంబర్ తీసుకెళ్లాలని, డీలర్లు బుకింగ్ నంబర్ మరియు ఆధార్ నంబర్ పరిశీలించిన తరువాతే యూరియా ఇవ్వాలని సూచించారు. బుకింగ్ చేసిన 24 గంటలలోపు కొనుగోలు చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా రైతులు, ఎస్‌డీఎస్ రైతులు, కౌలు రైతులు కూడా యూరియా బుక్ చేసుకోవచ్చని, పంపిణీ పూర్తిగా ఈ- పీఓఎస్ యాప్ విధానంలోనే జరుగుతుందని స్పష్టం చేశారు. యాప్ ద్వారా జిల్లా వ్యాప్తంగా యూరియా ఎక్కడ అందుబాటులో ఉందో రైతులకు నేరుగా సమాచారం లభిస్తుందని, సహకార సంఘాల ద్వారా కూడా కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ అవసరానికి అనుగుణంగా ముందుగానే యూరియా బుక్ చేసుకోవాలని శ్రీలత కోరారు.

# కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలపై సర్దార్ రవీందర్ సింగ్ విమర్శలు



**కరీంనగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ మీడియా సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. బండి సంజయ్ ఫేక్ మేనిఫెస్టోతో ప్రజలను మభ్యపెడుతున్నారని, ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులపై శ్రద్ధ చూపలేదని ఆరోపించారు. కరీంనగర్‌లో అతిపెద్ద జాతీయ జెండా నిర్మాణానికి మున్సిపల్ నిధులు కెసిఆర్ హయాంలోనే వినియోగించామని, కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో కరీంనగర్ జిల్లాకు నిధులు కేటాయించకపోవడం ఘోర వైఫల్యమని, స్మార్ట్ సిటీ నిధుల్లో కూడా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టోలో పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కూడా అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్, బీజేపీ లక్ష్యమని అన్నారు. తాను మేయర్‌గా ఉన్నప్పుడు కేసీఆర్ స్మార్ట్ సిటీ పనులకు పునాది వేశారని గుర్తుచేసి, బిఆర్ఎస్ ప్రభుత్వమే ఇంటింటా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిందని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని 58వ డివిజన్‌లో పుట్టిన ప్రతి ఆడపిల్లకు రూ.10,116, పెండ్లి కట్నం కోసం రూ.25,116, మగబిడ్డ పుడితే రూ.5,116 చేయిత పథకం అందజేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలే కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల అసత్య ప్రచారాలకు తగిన బుద్ధి చెబుతారని సర్దార్ రవీందర్ సింగ్ వ్యాఖ్యానించారు.

## అంగరంగ వైభవంగా ఆరుట్లలో వేణుగోపాల స్వామి జాతర



**ఆరుట్ల, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆరుట్ల గ్రామంలో ప్రతిష్టాత్మకంగా జరిగే శ్రీ శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణం, రుక్మిణి--సత్యభమా కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని చూడటానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సంవత్సరం కొత్త పాలక మండలి ప్రత్యేక శ్రద్ధతో వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం విశేషం. హైదరాబాదులో నివసిస్తున్న ఆరుట్ల గ్రామస్తులు కూడా జాతరకు విచ్చేశారు. కళాకారుల ప్రదర్శనలు, గ్రామ పంచాయతీ సౌకర్యాలు, యువత ఉత్సాహం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ మానుపటి శోభ కుమార్, ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మండల అధ్యక్షుడు చీరాల రమేష్, మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి, వేదిరె హనుమంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొంగరి విష్ణు వర్ధన్ రెడ్డి, అనంగాళ్ల యాదయ్య, సుంకరి పండారిగౌడ్, పండాల జంగయ్య, యండి జానీపాషా, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. భక్తులు, గ్రామస్తులు, నాయకులు కలిసి వేణుగోపాల స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# లేబర్ కోడ్స్ రద్దు కోసం దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

**- యు. శ్రీనివాస్**




**కరీంనగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ల జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బద్దం ఎల్లారెడ్డి భవనంలో జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్, టియుసిఐ నాయకులు రాజమల్లుతో పాటు ఇతర యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి, ఏఐటీయూసీ కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, టియుసిఐ కార్యదర్శి జిందం ప్రసాద్, బిఆర్ఎస్‌కెవి అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్రం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడం కార్మికుల హక్కులను హరించడమేనని విమర్శించారు. వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి రక్షణ కోడ్ ఆల్ కార్మిక వ్యతిరేకమేనని, వీటి వల్ల కనీస వేతనాలు కూడా లభించడం లేదని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు పెరిగాయని, ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు పెరిగినా పరిహారం అందడం లేదని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలు స్వలాభం కోసం కార్మికులను దోపిడీ చేస్తున్నాయని, ఈ కోడ్ల వల్ల కార్మికుల జీవన ప్రమాణాలు మరింత దిగజారిపోతాయని అన్నారు. అందుకే లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు రామారావు పాల్గొన్నారు.

# నీటిపారుదల శాఖ ఫోరం సర్వసభ్య సమావేశం



**కరీంనగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎల్ఎండి కాలనీలో నీటిపారుదల శాఖ ఫోరం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2026--2029 పదవీకాలానికి ఫోరం ఎన్నికలు నిర్వహించగా, అన్ని పదవులకు ఒకే సెట్ నామినేషన్లు రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జి. రమేష్ జిల్లా అధ్యక్షుడిగా, వి. ప్రసాద్ జిల్లా కార్యదర్శిగా, డీ. ధనలక్ష్మి అసోసియేట్ ప్రెసిడెంట్‌గా, ఎం.డి. అస్కర్ అలీ కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఇతర పదవులకు కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శంకర్, నాగేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, పోలు కిషన్, నాగరాజు, రాగి శ్రీనివాస్, హరికృష్ణ, సందీప్, హరిమేందర్ సింగ్, ఒంటెల రవీందర్ రెడ్డి, రామస్వామి, రాజయ్యతో పాటు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సీపీ సమీక్ష



**గంగాధర, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో ఈ నెల 5న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటనను పురస్కరించుకుని ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం గుమ్లాపూర్ సభా ప్రాంగణం, హెలిపాడ్, పార్కింగ్ స్థలాలను పోలీస్ కమిషనర్ స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణంలో భద్రతా చర్యలపై సీపీ ప్రత్యేక దృష్టి సారించారు. బారికేడ్ల నిర్మాణం ప్రజలకు ఇబ్బంది కలగకుండా పటిష్టంగా ఉండాలని సూచించారు. డ్రోన్ కెమెరాల ద్వారా ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను పర్యవేక్షించి భౌగోళిక పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. సభకు వచ్చే వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎక్కడా లోటుపాట్లు లేకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరావెయ్యాలి

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి మరింత బలాన్ని ఇవ్వాలని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 11న జరగనున్న ఎన్నికల్లో 20 స్థానాలు కాంగ్రెస్ పార్టీకి గెలిపించాలని ఆయన కోరారు. 1, 2, 3, 12, 13, 14వ వార్డుల్లో అభ్యర్థులతో కలిసి డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించిన మంత్రి, ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. హుస్నాబాద్ పట్టణంలో ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి జరుగుతోందని, గతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, ప్రస్తుతంలో 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, వడ్డీలేని రుణాలు వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేస్తున్నామని, 250 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఇంజనీరింగ్ కళాశాల, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉపాధి అవకాశాల కోసం ఇండస్ట్రియల్ కారిడార్, మహిళలకు సెట్విన్ శిక్షణ, ఫిషరీస్ మార్కెట్, కోల్డ్ స్టోరేజ్ ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని, తద్వారా హుస్నాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత-సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**మానకొండూర్, ఫిబ్రవరి 2 తిమ్మాపూర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విడ్స్ స్వచ్ఛంద సంస్థ, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌లో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ ఎఫ్ఎల్‌సి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఆదాయం--ఖర్చులను సక్రమ ప్రణాళికతో నిర్వహించుకోవాలని, అవసరమైన ఖర్చులకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఆదాయంలో కొంత భాగాన్ని తప్పనిసరిగా సేవ్ చేయాలని సూచించారు. అవసరం లేకుండా లోన్లు, ఇఎంఐలు తీసుకోవద్దని హెచ్చరించారు. సైబర్ నేరాలు జరిగితే ఎవరిని సంప్రదించాలి, ఎలా ఫిర్యాదు చేయాలి అనే అంశాలపై స్పష్టమైన సమాచారం అందించారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 మరియు వెబ్‌సైట్ గురించి ప్రజలకు తెలియజేశారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఎక్కువగా సైబర్ నేరాలకు గురవుతున్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ తొర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల సమయంలో జాగ్రత్తగా ఉండి, అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలకు స్పందించకుండా ఉంటే సైబర్ నేరాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సాగరిక, క్రాంతి కుమార్, గ్రామ పెద్దలు, సర్పంచ్ వాల ప్రదీప్ రావు, ఉపసర్పంచ్ సంపత్, కార్యదర్శి కిరణ్, వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు - సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలంటే సంబంధిత ఏసీపీ అనుమతి తప్పనిసరి అని, అనుమతి లేకుండా జరిగే కార్యక్రమాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా మారణాయుధాలు ధరించి సంచరించడం, రోడ్లపై జనాన్ని సమీకరించడం, అనుమతి పత్రాల్లో పేర్కొన్న ప్రాంతాల్లో శబ్దకారక కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 28 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. డీజేలపై నిషేధాజ్ఞలు పొడిగింపు కమీషనరేట్ పరిధిలో డీజే సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాన్ని ఈ నెల 28 వరకు పొడిగించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. అవసరమైతే మైక్ సెట్లు వినియోగించడానికి సంబంధిత ఏసీపీ అనుమతి తప్పనిసరి అని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధం కొనసాగింపు మహిళలు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాన్ని ఈ నెల 28 వరకు పొడిగించారు. మద్యం సేవించి వీధుల్లో అసభ్య పదజాలం ఉపయోగించడం, ప్రజలకు ఇబ్బంది కలిగించడం వంటి ఘటనలపై పలు ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి - ఎమ్మెల్యే విజయ రమణారావు

**ఎలిగేడు, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రజలను కోరారు. సోమవారం రాత్రి ఎలిగేడు మండలం శివపల్లిలో సుల్తానాబాద్ మున్సిపల్ అభ్యర్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండేళ్లలో కోట్లాది రూపాయలు తెచ్చి నియోజకవర్గ అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో కూడా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



# తెలంగాణ క్రీడాకారులు రాణించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పం

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**మానకొండూర్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శెంకరపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్స్ వంటి విశ్వవేదికలపై తెలంగాణ క్రీడాకారులు రాణించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. భారత ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోవడం వల్ల అవమానకర పరిస్థితులు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించేలా క్రీడాకారులకు తర్ఫీదు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్‌లో దేశానికి అత్యుత్తమ క్రీడాకారులను తెలంగాణ రాష్ట్రం నుంచి అందించాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్నదని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఎంపిడీవో కృష్ణ ప్రసాద్, తహశీల్దార్ సురేఖాదేవి, ఎస్ఐ శేఖర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వయ్యగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

# శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**ఆలయ నిర్మాణ దాత రేగట్టి శ్రీనివాసులు**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పట్టణంలో అయ్యప్ప కొండ వద్ద వెలసిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే చతుర్ధ వార్షికోత్సవము సందర్భంగా మూడు రోజులపాటు జరిగే వివిధ పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ రేగట్టి శ్రీనివాసులు తెలియజేశారు. ఆలయ చైర్మన్ మాట్లాడుతూ 3.2.2026 మంగళవారం నుండి 5.2.2026 గురువారం వరకు పూజా కార్యక్రమాల వివరాలను తెలియజేశారు . మొదటిరోజు మహాగణపతి పూజ, అఖండ దీపారాధన ,పంచకలశ స్థాపన, కంకణ ధారణ ,మహాగణపతి హోమం, స్వామివారికి అలంకరణ, రెండవ రోజు 4.2.2026 బుధవారం నాడు ఉదయం రుద్ర హోమం, సాయంత్రం కోలాటం నృత్యాలు, స్వామివారి ఉత్సవ విగ్రహాలు పురవీధుల గుండా ఊరేగింపు, మూడవరోజు 5.2.2026 గురువారం నాడు ఉదయం 11:30 గం: శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం జరుపబడును అని అన్నారు. ప్రతిరోజు భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ జరుగును అని అన్నారు. భక్తులు, మహిళలు, శివ స్వాములు, పట్టణ ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని ఆయన భక్తులను కోరారు.

# ఎలిగేడు లో సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం






**ఎలిగేడు, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. మండల చైర్మన్ భాస్కర్‌రావు, తహసిల్దార్ యాకయ్య, విద్యాధికారి నరేంద్ర చారి, ఎస్సై మధుకర్, హెచ్ఎం దేవేందర్‌రావు ప్రారంభించారు. కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో ఎలిగేడు, బాలికల విభాగంలో సుల్తానాపూర్ ప్రథమ స్థానాలు సాధించగా, ద్వితీయ స్థానాలు వరుసగా శివపల్లి, ఎలిగేడు గెలుచుకున్నాయి. కోకోలో బాలుర విభాగంలో ధూళికట్ట, బాలికల విభాగంలో సుల్తానాపూర్ విజేతలయ్యారు. ద్వితీయ స్థానాలు బాలురలో సుల్తానాపూర్, బాలికలలో ఎలిగేడు సాధించారు. వాలీబాల్‌లో బాలుర విభాగంలో సుల్తానాపూర్ జట్టు ప్రథమ స్థానం, ధూళికట్ట ద్వితీయ స్థానం పొందాయి. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ మండల కన్వీనర్ పీడి ప్రణయ్, ధూళికట్ట పీడి శ్రీకాంత్, సుల్తానాపూర్ పీడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కాంప్లెక్స్ హెచ్ఎం దేవేందర్ రావు

# 150కు పైగా కాకులు మృతి

**బర్డ్ ఫ్లూ నిర్ధారణ, హెచ్చరిక జారీ**



**పాట్నా - ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఒక ప్రాంతంలో సుమారు 150కుపైగా కాకులు మరణించాయి. నామూనాలు సేకరించి ల్యాబ్స్‌కు పంపారు. బర్డ్ ఫ్లూ కారణంగా ఆ కాకుల చనిపోయినట్లు నిర్ధారణ అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. స్థానికులకు హెచ్చరికలు జారీ చేసింది. బీహార్‌లోని భాగల్పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జనవరి 11న నౌగాచియా సబ్‌డివిజన్‌లో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన వారు వందలాది కాకులు మరణించడాన్ని గమనించారు. ఇతర పక్షులు కూడా అలాంటి స్థితిలో ఉండటం చూశారు. ఆందోళన చెందిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా, అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరణించిన పక్షులను సురక్షితంగా తొలగించారు. అటవీ, పశు సంవర్ధక శాఖల సంయుక్త బృందం కలిసి సీరం నమూనాలు సేకరించారు. పరీక్ష కోసం పాట్నా, భోపాల్‌లోని ఉన్నత స్థాయి ప్రయోగశాలలకు పంపారు. బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా ఆ కాకులు మరణించినట్లు నిర్ధారణ అయ్యింది. మరోవైపు భాగల్పూర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభావిత జోన్ పరిధిలోని 10 కిలోమీటర్ల వరకు శానిటైజేషన్ డ్రైవ్ చేపట్టింది. చుట్టుపక్కల ప్రాంతంలోని కోళ్ల ఫారాల నుంచి నమూనాలను సేకరిస్తున్నారు. బర్డ్ ఫ్లూపై నిఘా, పర్యవేక్షణను ముమ్మరం చేశారు. అయితే ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపారు. అనారోగ్యం చెందిన లేదా మరణించిన పక్షులను తాకవద్దని సూచించారు. పక్షుల మరణాలు గుర్తించిన వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ని పరిశీలించిన విద్యా కమిషన్ సభ్యురాలు



**మంచాల, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యా కమిషన్ సభ్యురాలు జోష్ణ రెడ్డి సోమవారం మంచాల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించారు. జూనియర్ కాలేజీలో టీపీఎస్ పనులను పరిశీలించి, ఎంఎస్‌డిఎంసి సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు ఆర్. నారాయణ రెడ్డి, జూనియర్ కాలేజ్ బాధ్యులు, జెడ్పిహెచ్‌ఎస్ గర్ల్స్ ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుబియానా, ఉపాధ్యాయులు సుజన, నారాయణ రెడ్డి, ఎస్ఎంసి సభ్యులు అశ్వాల బాల్ రాజ్, గడ్డం సుధాకర్, విజయ, కోడూరు వెంకటేష్, బెల్లంపల్లి శ్రీనివాసరెడ్డి, జక్కా చంద్రశేఖర్, ఏర్పుల సురేష్, ఎలమోని గీత, గుంటి రాధిక, ఓరుగంటి లావణ్య, ఓరుగంటి మమత, సంకీర్తన, ఇస్లావత్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని వినతిపత్రం



**అచ్చంపేట, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుల వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు, ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు గెలిచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని నేతలు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ చత్రు నాయక్, యూత్ కాంగ్రెస్ నేతలు కుంద మల్లిఖార్జున్, నాయిని జైపాల్, అచ్చంపేట ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు చింతల రాజ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ వనరుల అభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభించిన కలెక్టర్ బాదావత్ సంతోష్




**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ శిక్షణ కేంద్రంలో మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల క్షేత్రస్థాయి శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే అధికారులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో సామర్థ్యం పెంపొందించడంలో క్షేత్రస్థాయి పరిశీలన ఆధారిత శిక్షణ కీలకమని పేర్కొన్నారు. నూతనంగా ఎంపికైన గ్రూప్--× అధికారుల కోసం ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్, స్టడీ టూర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సలేశ్వరం, అక్కమహాదేవి ఆలయాలు, నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రకృతి సౌందర్యం, వన్యప్రాణులు, చెంచు గిరిజనుల జీవన విధానం అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. నల్లమలలోని జలపాతాలు, గుహలు, వృక్షజాలం, వన్యప్రాణులు, కృష్ణా తీరం వెంబడి ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపునిస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, డా. తిరువెంగళ చారి, గ్రూప్--× అధికారులు పాల్గొన్నారు.